సాక్షి హనుమకొండ

మంగళవారం । 26 । ఆగస్టు । 2025



ఇంటినుంచే తపాలా సేవలు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రకాల పోస్టల్ సర్వీసులు తపాలా వినియోగదారులు ఇంటినుంచే పొందవచ్చు.

- 8లో▸



కమీషన్ డబ్బులు చెల్లించాలి

రేషన్ డీలర్లకు పెండింగ్‌లో ఉన్న కమీషన్ డబ్బులు చెల్లించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌బాబు కోరారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $30^0/24^0$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

నోటిఫికేషనే తరువాయి..

స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధం

- సెప్టెంబర్ మొదటి వారంలో ప్రకటించే అవకాశం
- 'స్థానిక'ంలో బీసీలకు 42 శాతం అవకాశం.. పార్టీ కేడర్‌కు కాంగ్రెస్ సంకేతాలు
- ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ.. ఆ తర్వాతే సర్పంచ్, 'ప్యాక్స్'ల ఎన్నికలు
- ఉమ్మడి జిల్లాలో 6 జెడ్పీలు, 75 జెడ్పీటీసీ స్థానాలు..
- జిల్లా కలెక్టర్లకూ సీఎస్ సమాచారం



సాక్షిప్రతినిధి, వరంగల్ :

స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి వేళయ్యిందా? రిజర్వేషన్లు తేలకున్నా.. ఎన్నికలు నిర్వహించేందుకు సర్కారు సిద్ధమవుతోందా? ఈ మేరకు పార్టీ కేడర్, నాయకులకు సంకేతాలు అందాయా? పీఏసీలో తీసుకున్న నిర్ణయం మేరకు సెప్టెంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ వెలువడనుందా? ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారా?... అంటే నిజమే అంటున్నాయి కాంగ్రెస్ పార్టీ, అధికార వర్గాలు. నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడినా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సోమవారం కూడా జిల్లా కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలు అందాయన్న ప్రచారం జరుగుతోంది.

రాజకీయ పార్టీల్లో మొదలైన సందడి..

ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. మొదట పేర్కొన్న విధంగానే ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీపీపీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ వస్తే ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల్లో ఆరు జిల్లా ప్రజాపరిషత్‌లు, 75 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 778 ఎంపీటీసీ స్థానాలు 75 ఎంపీపీ స్థానాలను ప్రకటించి పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఆతర్వాత 1,708 గ్రామ పంచాయతీలు, 15,006 వార్డులకు ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికలు జరిపేలా 15,021 పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేసినట్లు అధికారులు ఇది వరకే ప్రకటించారు. కాగా, ఈ నెల 29న జరిగే తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ ఇటీవలి సమావేశంలో జరిగే కీలక నిర్ణయాలను బట్టి 'స్థానిక' ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండగా.. రాజకీయ పార్టీల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల సందడి పెరిగింది. సెప్టెంబర్ మాసంలో ఎన్నికలు ఖాయమన్న ప్రచారం నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల టికెట్లపై పోటీ చేసేందుకు ఆశావహులు సై అంటున్నారు. ఆయా పార్టీలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, ఆయా పార్టీల జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలను కలిసి తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు.

సెప్టెంబర్‌లోనే నోటిఫికేషన్? ఆ దిశగానే కసరత్తు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ముగిసి దాదాపుగా రెండేళ్లు కావస్తోంది. దీనిపై ఇదివరకే ఈ సెప్టెంబర్ నెలాఖరులోగా ఎన్నికలు జరిపించాలన్న హైకోర్టు ఆదేశాలు ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఇటీవల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికార పార్టీ నేతలు, సీఎం నిర్ణయించినట్లు ప్రచారం. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశం ఎటూ తేలకపోయినప్పటికీ.. పార్టీ పరంగా ఆ మేరకు అవకాశం కల్పించే యోచనలో అధిష్టానం ఉన్నట్టు ఆ పార్టీ ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు చెబుతున్నారు. ఈనెల 29న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలపై చర్చించి ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఎప్పుడు నోటిఫికేషన్ వెలువడినా.. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్లకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, చీఫ్ సెక్రటరీల నుంచి ఆదేశాలు అందడంతో అందరూ అలర్ట్ అయ్యారు.

ఉమ్మడి వరంగల్‌లో ఇలా..

జిల్లా	జెడ్పీపీ	జెడ్పీటీసీలు	ఎంపీపీలు	ఎంపీటీసీలు	సర్పంచ్	వార్డులు	పోలింగ్ కేంద్రాలు
హనుమకొండ	1	12	12	129	210	1,986	1,986
వరంగల్	1	11	11	130	317	2,754	2,754
జేఎస్‌భూపాలపల్లి	1	12	12	109	248	2,102	2,102
మహబూబాబాద్	1	18	18	193	482	4,110	4,110
ములుగు	1	10	10	83	171	1,520	1,535
జనగామ	1	12	12	134	280	2,534	2,534
	06	75	75	778	1,708	15,006	15,021

పాదయాత్ర చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, చిత్రంలో మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు



జనహిత పాదయాత్ర

- వివరాలు 8లో▸

వరంగల్ జిల్లా వర్ధన్నపేట పరిధి ఇల్లంద మార్కెట్ నుంచి మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జనహిత పాదయాత్ర నిర్వహించారు. వారి వెంట మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు, పార్టీ శ్రేణులు నడిచారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ముఖ్యనేతలు ప్రసంగించారు. - సాక్షి, వరంగల్

న్యూస్‌రీల్

నేడు మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ సోమవారం తెలిపారు. 300 మందికి మాత్రమే అందించనున్నట్లు, భక్తులు మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

బీపీ మండల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కేయూ క్యాంపస్: బిందేశ్వర్ ప్రసాద్ (బీపీ మండల్) ఆలోచనల్ని ఆదర్శంగా తీసుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం కోరారు. సోమవారం క్యాంపస్‌లోని ఆడిటోరియంలో బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ జయంతి నిర్వహించారు. బిపి మండల్ చిత్రపటానికి రిజిస్ట్రార్ రామచంద్రం, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సెల్ డైరెక్టర్ బొడిగ సతీశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు చిర్రరాజు, సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.అయిలయ్య, ప్రొఫెసర్ స్వర్ణలత, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఎ.శ్రీనివాసులు, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఎస్.వెంకటయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ జి.కృష్ణయ్య, బీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు, అధ్యాపకులు శ్రీకాంత్, ఫిరోజ్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



హన్మకొండ అర్బన్: సీపీఎస్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం (టీజీసీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు లింగమొల్ల దర్శన్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనలో భాగంగా ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను హనుమకొండ కలెక్టరేట్‌లో ఉద్యోగులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా దర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. టీజీసీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో.. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరేశం, నర్సింహులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, నరేంద్ర ప్రసాద్, శరత్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేడీసీలో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12న జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు కన్వీనర్ డాక్టర్ పి.పల్లవి సోమవారం తెలిపారు. 'మైక్రోబియల్ ఫ్రంట్ టైర్స్ హార్మోసింగ్ జీనోమిక్స్ సింథటిక్ బయాలజీ అండ్ మైక్రోబయోమ్ ఇన్నోవేషన్స్' అంశంపై ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసదస్సు బ్రోచర్‌ను ఇటీవల కేయూలో వీసీ ప్రతాప్‌రెడ్డి, కేడీసీ ప్రిన్సిపాల్ ఆచార్య గుర్రం శ్రీనివాస్ ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేడీసీ వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, బీఓఎస్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు జె.చిన్న, వి.శ్రీనివాస్, డి.వెంకన్న, యుగేందర్ తదితరులు పాల్గొన్నట్లు పల్లవి తెలిపారు.

మండపాలకు ఉచిత విద్యుత్

హన్మకొండ: గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈమేరకు టీజీ ఎన్పీడీసీఎల్ పరిధి 16 సర్కిళ్లలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ మెమో జారీ చేసింది. క్షేత్ర స్థాయిలో అధికారులు తమ పరిధి వినాయక మండపాలను సందర్శించి వాడుకుంటున్న లోడ్‌ను పరిశీలించి ఏ కేటగిరి కిందికి వస్తుందో వివరాలు పంపాలని ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అధికారులను ఆదేశించింది. ఒక కిలోవాట్ వరకు రూ.1,560; ఒక కిలోవాట్ నుంచి 1.5 కిలో వాట్ల వరకు రూ.2,300; 1.5 నుంచి 2 కిలోవాట్ల వరకు 3,020; 2 కిలో వాట్ల లోడ్ పైన ప్రతీ కిలో వాట్‌కు 3,020తో పాటు అదనంగా రూ.1,560 చొప్పున వివరాలు సేకరించాలని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అధికారులకు సూచించింది. ఈ మేరకు అధికారులు ఈనెల 30లోపు మండపాల వారీగా విద్యుత్ వినియోగం వివరాలు సేకరించి పంపనున్నారు.

బాలలపై లైంగిక దోపిడీని నిర్మూలించాలి

- వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ రవి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రవి

హన్మకొండ: బాలలపై లైంగిక దోపిడీని సమర్థవంతంగా నిర్మూలించాలని అడిషనల్ డీసీపీ ఎన్.రవి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ బెంగళూరు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సంయుక్తంగా రాష్ట్రంలోని ఎంపిక చేసిన స్వచ్ఛంద సంస్థలకు ఆన్‌లైన్‌లో 'బాలల లైంగిక దోపిడీని నిర్మూలించడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు సోమవారం ప్రారంభమైంది. ఎన్.రవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన లేకపోవడంతో బాలలు అత్యధికంగా లైంగిక దోపిడీకి గురవుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. సైబర్ క్రైమ్ ఏసీపీ గిరి కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై పిల్లలు, పెద్దలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలన్నారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ శుభ్రత్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల సీడబ్ల్యూసీ చైర్మన్, చైర్‌పర్సన్ అనిల్ చందర్ రావు, కె.నాగమణి, ఎఫ్ఎం శ్రామిక వికాస కేంద్రం డైరెక్టర్ లక్ష్మణ్ రావు, స్పార్డ్ డైరెక్టర్ ప్రసాద్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్లు బత్తుల కరుణ, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు..

కలెక్టర్ స్నేహ శబరీష్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 177 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ.గణేశ్, హనుమకొండ, పరకాల ఆర్డీఓ లు రాథోడ్ రమేశ్, డాక్టర్ కె.నారాయణ, సీపీఓ సత్యనారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పదోన్నతులకు వెబ్ ఆప్షన్లు షురూ

- అర్ధరాత్రి వరకు అవకాశం
- హనుమకొండ జిల్లాలో నేడు ఉత్తర్వుల అందజేత
- వరంగల్ జిల్లాలో సీనియార్టీ జాబితాపై కసరత్తు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఎస్జీటీల పదోన్నతులకు సోమవారం రాత్రి 8 గంటల నుంచి వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చారు. అర్ధరాత్రి 12 గంటల వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. రాత్రి 10 గంటల నుంచి ఎడిట్ ఆప్షన్‌కు అవకాశమిచ్చారు. హనుమకొండ జిల్లాలో 104 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో పదోన్నతులు లభించనున్నాయి. పదోన్నతులకు జిల్లాలో 137 ఎస్ఏ పోస్టులు వేకన్సీలుగా ఉన్నప్పటికీ వివిధ కేటగిరీల్లో 33 పోస్టులకు అర్హులైన టీచర్లు లేక 104 పోస్టుల్లోనే పదోన్నతులు కల్పించనున్నారు. ఈనెల 26న పదోన్నతులు లభించిన వారికి విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇవ్వబోతున్నారు.

ఇక వరంగల్ జిల్లాలో ఆలస్యమే..

వరంగల్ జిల్లాలో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాపై అధికారులు, సిబ్బందితో ఇంకా కసరత్తు కొనసాగుతోంది. దీంతో పదోన్నతుల ప్రక్రియ జాప్యమయ్యే అవకాశాలున్నాయి. 1:3 నిష్పత్తిలో సీనియార్టీ జాబితా వెల్లడించిన విద్యాశాఖ అధికారులు సోమవారం అభ్యంతరాలు స్వీకరించారు. ఇక మంగళవారం 1:1 నిష్పత్తిలో సీనియార్టీ జాబితాను వెల్లడించేలా జాబితా రూపొందిస్తున్నారు. బుధవారం రాత్రి నుంచి లేదా గురువారం వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇవ్వొచ్చని తెలుస్తోంది. వెబ్ ఆప్షన్లు ఇచ్చాక మరుసటిరోజు పదోన్నతులు పొందిన వారికి ఉత్తర్వులు ఇవ్వనున్నారు. వరంగల్ జిల్లాలో 122 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించబోతున్నాయి.

కేయూలో మూట కలకలం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌డీఎల్‌సీఈ -పరిపాలనా భవనం రోడ్డులో బిల్డింగ్ డివిజన్ ఎదురుగా ఓచోట చెట్ల ప్రాంతంలో ఒక సంచితో కూడిన మూట కలకలం సృష్టించింది. సోమవారం ఉదయం సెక్యూరిటీ సిబ్బంది కేయూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రవికుమార్, ఎస్ఐ శ్రీకాంత్ వచ్చి చూశారు. మూట నుంచి దుర్వాసన వస్తుండడంతో మృతదేహం ఉందని అనుమానించి క్లూస్‌టీంకు సమాచారమిచ్చారు. దీంతో క్లూస్‌టీం కూడా అక్కడికి చేరుకుంది. అందరి ఎదుట వీడియో తీయగా.. రెండు కుక్కల మృతదేహాలు కనిపించాయి. వీటిని ఎవరో చంపి క్యాంపస్‌కు తీసుకొచ్చి పడేసినట్లుగా అనుమానిస్తున్నారు.

వేయిస్తంభాల గుడిలో నవరాత్రి మహోత్సవాలు

- జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత



ఉత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏసీ సునీత, దేవాదాయశాఖ సిబ్బంది

హన్మకొండ కల్చరల్ : నగరంలోని వేయిస్తంభాల ఆలయంలో శ్రీమహాగణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ జిల్లా దేవాదాయధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ రామల సునీత తెలిపారు. సోమవారం దేవాలయంలో జరిగిన సమావేశంలో ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేవాలయంలో రేపటి (బుధవారం) నుంచి సెప్టెంబర్ 5వతేదీ వరకు శ్రీమహాగణపతి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈఓ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతీరోజు తమగోత్రనామాలతో పూజలు జరిపించుకోవాలనుకునేవారు రూ.2,116 చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, వెండిలాకెట్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ, గట్టు మహేష్‌బాబు, అమ్మవారి ఉపాసకులు సింధుమాతాజీ, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూ కబ్జాల పేట

కాజీపేట పరిధిలోని పేదల భూములపై పె(గ)ద్దల కన్ను

- కొందరు టీంగా ఏర్పడి ఖాళీ ప్లాట్లకు ఎసరు..
- సెటిల్‌మెంట్.. కాదని ఎదురుతిరిగితే రివర్స్‌గా పోలీస్ కేసు
- గుండెలు బాదుకుంటున్న బాధితులు
- కబ్జాదారులకు నాయకులు, రౌడీషీటర్ల అండ.. పట్టని అధికారులు

కాజీపేట: వరంగల్ ట్రై సిటీలో కాజీపేట ప్రధానమైంది. ఇక్కడి భూములకు మంచి డిమాండ్ ఉండడంతో ధరలు కూడా ఎకరాకు రూ.కోట్లు పలుకుతున్నాయి. దీంతో కాజీపేట పరిసర ప్రాంతాల్లోని పేదల భూములపై కబ్జాదారులు గద్దల్లా వాలుతూ తమ దందాను అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. ఈ మండలంలోని 19 వీలిన గ్రామాల్లో ఈ దందా ఇటీవల కాలంలో యథేచ్ఛగా సాగుతోంది. రాజకీయ నాయకుల అండదండలు దండిగా ఉన్న కొంతమంది దౌర్జన్యంగా వ్యవహరిస్తూ చిన్న, మధ్య తరగతి ప్రజల భూములు, ప్లాట్లను కబ్జా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా ఎదురు తిరిగితే వారిని భయానికి గురిచేస్తూ, దాడులకు దిగుతూ తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నారు. అదీ కుదరకపోతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు పెట్టిస్తూ బాధితులను భయభ్రాంతులకు గురి చేసి పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నాడు చోటామోటా.. నేడు కోటీశ్వరులు

కాజీపేట పరిధిలో ఒకప్పుడు చోటామోటాగా ఉన్న వారు నేడు భూకబ్జాలు చేస్తూ లక్షలకు, కోట్లకు పడగలెత్తుతున్నారు. బాధితుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉన్నప్పటికీ వారి విషయంలో స్పందించని సంఘాలు, నాయకులు కబ్జాదారులకు వంత పాడడంపై ప్రజలు మండిపడుతున్నారు. తమకో న్యాయం, కబ్జాదారులకో న్యాయమా.. అంటూ తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పలువురు బాధితులు ఈ కబ్జాల విషయమై సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌ను కలిసి న్యాయం చేయాలని కోరుతూ తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆ సమయంలో సీపీ వెంటనే భూకబ్జాదారులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు సైతం జారీ చేశారు. ఇక్కడి నాయకుల జోక్యమో.. లేక కబ్జాదారుల చేతివాటమో తెలియదుగానీ కబ్జాదారుల హవా మాత్రం తగ్గట్లేదు.

సీపీ గారూ.. జర దృష్టి పెట్టండి

కాజీపేట చుట్టు పక్కల గ్రామాల్లో నానాటికీ పెరుగుతున్న భూకబ్జాదారుల బాగోతాలపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ దృష్టి పెట్టాలని బాధితులు వేడుకుంటున్నారు. తాము బహిరంగంగా మాట్లాడితే కబ్జాదారులు ఏమైనా చేస్తారేమోనని భయపడుతున్నామని వాపోతున్నారు. పెట్రేగిపోతున్న భూకబ్జాదారుల ఆగడాలకు కళ్లెం వేయాలని కోరుతున్నారు.



సిద్ధార్థనగర్‌లో వివాదాస్పదంగా మారిన భూమి

కబ్జాల్లో కొన్ని ఇలా..

- ప్రశాంత్‌నగర్ కాలనీలో కొంతమంది సభ్యులు ఒక టీంగా ఏర్పడి ఏకంగా దాదాపు 18 ఖాళీ ప్లాట్లకు ఎసరు పెట్టారు. కొన్ని ప్లాట్లలో భవనాల నిర్మాణం కూడా పూర్తయ్యింది.
- ప్రశాంత్‌నగర్, వడ్డేపల్లి శివారుల్లో 25 ఏళ్ల కింద కొనుగోలు చేసిన ప్లాట్లను ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించడం చర్చనీయాంశంగా మారింది. ఆ ప్లాట్లు కొనుగోలు చేసినప్పుడు సదరు ప్రజాప్రతినిధి పుట్టి ఉండకపోవచ్చని యజమానులు కన్నీరు పెడుతున్నారు.
- సిద్ధార్థనగర్ కాలనీలో ఓ ఆంగ్లో ఇండియన్‌కు చెందిన విలువైన స్థలంపై ఇంకా వివాదం కొనసాగుతూనే ఉంది. దీని వెనుక బలమైన నాయకుడి హస్తం ఉందని కనిపించిన వాళ్లకు చెప్పుకుని రోదిస్తున్నాడు.
- మడికొండకు చెందిన ఓ వృద్ధురాలికి నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, దాన్ని కబ్జా చేసి ముప్పుతిప్పలు పెడుతున్నారు. రెవెన్యూ అధికారులు సైతం కబ్జాదారులకే వంతపాడడం చర్చనీయాంశమైంది.
- టేకులగూడెం గ్రామ శివారులో ఉన్న ఓ ఐటీఐ యజమానికి చెందిన 3 ఎకరాల స్థలానికి తప్పుడు కాగితాలు సృష్టించి పట్టా చేసుకోవడమే కాకుండా రెండున్నర కోట్లకు విక్రయించారు. దీనికి గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు సహకరించారనే ఆరోపణలున్నాయి. ఈ వివాదం కోర్టులో ఉంది.

కబ్జాలకు ప్రయత్నిస్తే కేసులు పెట్టాలి...



భూకబ్జాలకు ఎవరు ప్రయత్నించినా క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఆరుగాలం కష్టించి తినక, తాగక నాలుగు పైసలు వెనకేసుకుని ప్లాట్ కొనుక్కుంటే కబ్జాదారులు ఏడిపించడం బాధాకరం. కబ్జాదారులు ఎంతటి వారైనప్పటికీ పోలీసులు వదిలిపెట్టొద్దు.

- ఎండీ చాంద్‌పాషా, బాధితుడు

బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయొచ్చు



భూకబ్జాలకు ప్రయత్నిస్తే కఠినంగా అణిచివేస్తాం. రౌడీషీటర్లను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చాం. పేద, మధ్య తరగతి ప్రజల భూముల జోలికి వెళ్తే చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తుందని కబ్జాదారులు గుర్తించాలి. క్షేత్రస్థాయిలో ఏదైనా ఇబ్బంది కలిగితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

- పింగిళి ప్రశాంత్‌రెడ్డి, ఏసీపీ, కాజీపేట

వ్యాధులపై చైతన్యం కల్పించాలి



కళాజాతను ప్రారంభిస్తున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ చాహత్

వరంగల్ అర్బన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కళాజాత ప్రదర్శనను మేయర్ సుధారాణితో కలిసి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. కీటక జనిత, నీటి జనిత వ్యాధులు, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై గేయాలతో ఆలోచింపజేసేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ రాజేశ్, సూపరింటెండెంట్ దేవేందర్, శానిటరీ సూపర్‌వైజర్లు భాస్కర్, గోల్కొండ శ్రీను, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రకాశ్, భీమయ్య, అనిల్, సురేశ్ పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్, రిమాండ్

ఖిలా వరంగల్: దొంగను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.5.50 లక్షల విలువైన 56.083 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి.సురేందర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన వల్లపు గోపి(29) వరంగల్ ప్లాట్ ఫామ్‌పై సోమవారం అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో జీఆర్పీ పోలీసులు తనిఖీ చేయగా.. రూ.5.50 లక్షల విలువైన 56.083 గ్రాముల బంగారం లభ్యమైంది. అనంతరం విచారించగా ఇటీవల నెక్కొండ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల వద్ద చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఆర్పీ సిబ్బంది రాము, రియాజోద్దీన్, నాగరాజు, ఏఎస్సై రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నౌవేరా షేక్‌కు రిమాండ్

వరంగల్ లీగల్: హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ (ఎం/ఎస్ హీరా గోల్డ్ ఎగ్జిమ్ లిమిటెడ్) సీఈఓ నౌవేరా షేక్‌పై ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కాగా సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి జిల్లా ప్రధాన న్యాయస్థానం ఎదుట హాజరుపర్చారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి నిర్మలా గీతాంబ అదేశాలు జారీ చేశారు. హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీ సీఈఓ నౌవేరా షేక్ వరంగల్ చార్‌బౌలి ప్రాంతానికి చెందిన షాహేద్ పర్వీజ్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులను ప్రలోభ పెట్టి పెద్ద మొత్తంలో బంగారంపై పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో వడ్డీ, లాభాలు అందిస్తామని తెలపడంతో ముగ్గురు బాధితులు రూ.33 లక్షలు చెల్లించారు. పెట్టుబడి అనంతరం వారికి సుమారు రూ.32వేలు మాత్రమే కంపెనీనుంచి రాగా విచారణలో మోసపోయామని నిర్ధారించుకొని 2021, జనవరి 14న బాధితుడు షాహేద్ పర్వీజ్ చేసిన ఫిర్యాదు మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో 2021లో నౌవేరా షేక్‌కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతీ ఆదివారం సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని, అలాగే ప్రతీ కోర్టు వాయిదాకు హాజరుకావాలని న్యాయమూర్తి షరతులు విధించారు. పలు వాయిదాలకు నిందితురాలు నౌవేరా షేక్ హాజరు కాకపోవడంతో జిల్లా కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ వారెంట్ మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులు నిందితురాలిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా సెప్టెంబర్ 8 తేదీ (14 రోజుల) వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారు.

సైబర్ నేరస్తుడి అరెస్ట్

వరంగల్ క్రైం : బెయిల్ కండీషన్లను ఉల్లంఘించిన సైబర్ నేరస్తుడిని అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైం ఏసీపీ గిరికుమార్ తెలిపారు. ఈ ఏడాది మార్చిలో తిరుమల హ్యాచరీస్‌లో పనిచేసే మేకల శ్రీనివాస్‌కు ఫోన్ చేసి నమ్మించి ఓం సాయి ట్రేడర్స్ అకౌంట్‌కు రూ.1.68 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మోసం చేశాడు. ఈ ఘటనపై బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన సంజిత్ కుమార్‌సింగ్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపించినట్లు తెలిపారు. నిందితుడు బెయిల్‌పై బయటకు వచ్చి క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ప్రతీ ఆదివారం హాజరు కావాల్సి ఉండగా రాలేదన్నారు. దీంతో మెమో సమర్పించగా నిందితుడి అరెస్ట్‌కు కోర్టు ఆదేశించిందన్నారు. ఆదివారం నిందితుడిని అరెస్ట్ చేసి పరకాల జైలుకు తరలించినట్లు క్రైమ్ డీసీపీ పేర్కొన్నారు. కాగా, నిందితుడిని సకాలంలో అరెస్ట్ చేసిన నేపథ్యంలో తెలంగాణ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్.. ఏసీపీ గిరికుమార్‌ను అభినందించారు.

ఇంటినుంచే తపాలా సేవలు

పోస్టల్ సర్వీసులకు కొత్త సాఫ్ట్‌వేర్
- సాంకేతిక వ్యవస్థతో అనుసంధానం
- స్వీయ-సేవ పోర్టల్ వెబ్ ఆధారిత బుకింగ్ సౌకర్యాలు
- 1 నుంచి రిజిస్టర్డ్ పోస్టుకు మంగళం.. స్పీడ్‌పోస్ట్‌లో విలీనం



వరంగల్ హెడ్ పోస్టాఫీస్



ఖిలా వరంగల్ : ఆన్‌లైన్ సౌకర్యం లేని కాలంలో తపాలా శాఖ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించింది.. నిరుద్యోగులకు ఇంటర్వ్యూ కాల్ లెటర్ రావాలన్నా.. ఉద్యోగం వచ్చిందన్న సమాచారం తెలుసుకోవాలన్నా.. బంధుమిత్రులకు వర్తమానం, సంస్థలు, కార్యాలయాలకు ముఖ్యమైన ధ్రువీకరణ పత్రాలు పంపాలన్నా.. ఒకప్పుడు పోస్టల్ సేవలు ప్రధాన ఆధారం. ప్రస్తుతం వినియోగదారుడు ఉన్న చోటు నుంచే తపాలా సేవలు పొందేలా అధునాతన సౌకర్యాలు కల్పించింది.
ఇటీవల తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్‌తో సాంకేతిక అనుసంధానం చేసి దేశీయ, విదేశీయ లెటర్లు, పార్సల్ బుకింగ్, స్పీడ్ పోస్ట్ అన్నీ స్వీయ-సేవ పోర్టల్ వెబ్ ఆధారంగా పోస్టాఫీసుకు వెళ్లకుండానే ఇంటి నుంచే సులభంగా తపాలా సేవలు పొందవచ్చు.
india post.gov.in /customer&eltservice/ login యూజర్ ఐడీ, మొబైల్ ఓటీపీ, కస్టమర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా లెటర్లు, పార్సల్స్, స్పీడ్ పోస్టులు అన్నీ ఇంటి వద్దే పొందొచ్చు. ఆన్‌లైన్ బుకింగ్ చేయగానే పోస్ట్‌మెన్ వినియోగదారుల ఇంటికి చేరుకుని స్పీడ్‌పోస్ట్ సేవలు, పార్సిల్స్ సేకరించి ఆన్‌లైన్ ట్రాకింగ్ విధానంతో గమ్యానికి చేరవేయనున్నారు.

సేవలన్నీ ఒకే గొడుగు కిందికి..

తపాలా కార్యాలయాల ద్వారా అందించే సేవలన్ని ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. నూతన ఐటీ 2.0 పేరుతో కొత్త సాఫ్ట్‌వేర్‌తో డేటా భద్రతతోపాటు సిస్టమ్ స్పీడ్ సామర్థ్యం పెంచారు. వరంగల్ డివిజన్ ప్రధాన కార్యాలయ పరిధిలో వరంగల్, మహబూబాబాద్ హెడ్ పోస్టాఫీసులు ఉండగా.. 42 సబ్ పోస్టాఫీసులు, 362 గ్రామీణ పోస్టాఫీసులు ద్వారా వినియోగదారులు తపాలా సేవలు పొందుతున్నారు.

కాలానుగుణంగా మార్పులు..

మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖ కూడా మారుతోంది. ప్రైవేట్ సంస్థలకు దీటుగా ఇప్పటికే ఎన్నో సేవలతో అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోస్టల్ శాఖ అంతే వేగంగా స్పీడ్ పోస్ట్ విధానానికి శ్రీకారం చుడుతోంది. బ్రిటిష్ కాలం నుంచి కొనసాగుతున్న రిజిస్టర్డ్ పోస్ట్ సేవలను స్పీడ్ పోస్ట్‌లో కలుపుతున్నట్లు భారత తపాలా శాఖ ప్రకటించింది.

రిజిస్టర్డ్ పోస్ట్ స్పీడ్ పోస్ట్‌లో విలీనం..!

స్మార్ట్ ఫోన్లు, ఆన్‌లైన్ సౌకర్యాలు లేని రోజుల్లో రిజిస్టర్డ్ పోస్ట్ ప్రజల జీవితాలతో విడదీయరాని బంధాన్ని ఏర్పర్చుకుంది. ముఖ్యమైన పత్రాలు, వస్తువులను సురక్షితంగా, నమ్మకంగా పంపించడానికి ఇదే ప్రధాన మార్గంగా నిలిచింది. అయితే సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రిజిస్టర్డ్ పోస్ట్ సేవలు నిలిపి వేస్తున్నట్లు భారత తపాలా శాఖ ప్రకటించింది. స్పీడ్ పోస్ట్‌లోకి రిజిస్టర్డ్ పోస్ట్ సేవలను విలీనం చేసి.. ఇంకా మెరుగైన సేవలు అందించనున్నది.

సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తాం..



అధునాతన పరిజ్ఞానంతో ఖాతాదారులకు ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నాం. ప్రైవేట్‌కు దీటుగా సేవలు అందించాలన్న లక్ష్యంతో నూతన విధానం అమల్లోకి తెస్తున్నాం. 1వ తేదీనుంచి రిజిస్టర్డ్ పోస్ట్ సేవలన్నీ స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేసి ఆన్‌లైన్ ట్రాకింగ్ ద్వారా సేవలు అందిస్తాం. ప్రజలు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ బుకింగ్ చేసిన ప్రతీ సేవను పది నిమిషాల వ్యవధిలో పోస్ట్‌మన్ మీ ఇంటికి చేరుకొని సేవలు అందిస్తారు. ఖాతాదారులు తమ ఇంటివద్ద తపాలా సేవలన్నీ పొందేలా చర్యలు తీసుకున్నాం. - రవికుమార్, తపాలాశాఖ, డివిజనల్ సూపరింటెండెంట్, వరంగల్

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతోపాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

మరో పెళ్లికి అడ్డుగా ఉందని..

భార్యను చంపిన భర్త
- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వరంగల్ ఏఎస్పీ శుభం నాగ్రాలే



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

రామన్నపేట : మరో పెళ్లికి అడ్డుగా ఉందనే కారణంతో భర్త.. భార్యను చంపాడు. నిద్రిస్తున్న సమయంలో ఆమె ముఖంపై బెడ్‌షీట్ కప్పి ఊపిరాడకకుండా చేసి కిరాతకంగా హతమార్చాడు. ఈ ఘటన వరంగల్ మట్టెవాడ పీఎస్ పరిధిలోని హంటర్ రోడ్డులో ఆదివారం చోటుచేసుకోగా, ఘటన జరిగిన 24 గంటల్లోనే పోలీసులు ఛేదించి నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను వరంగల్ ఏఎస్పీ శుభం నాగ్రాలే వెల్లడించారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం దిర్శనపల్లి గ్రామానికి చెందిన బాదావత్ అశోక్ కూతురు గౌతమి(22)కి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్యా తండాకు చెందిన బానోత్ గణేశ్‌తో ఈ ఏడాది మేలో వివాహం జరిగింది. గణేశ్‌కు కట్నకానుకల కింద రూ.2.5 లక్షల నగదు, రెండు తులాల బంగారంతోపాటు 150 గజాల స్థలాన్ని త్వరలోనే ఇస్తామని హామీ ఇచ్చి వివాహం జరిపించారు. గణేశ్ ఆటో నడుపుకుంటూ హంటర్ రోడ్డులోని పద్మావతి ఫంక్షన్ హాల్ సమీపంలో అద్దెకుంటున్నాడు. పెళ్లి అనంతరం నెల రోజుల వరకు బాగానే ఉన్న గణేశ్.. ఆటో నడుపుకోవడానికి అదనపు కట్నం కావాలని భార్య గౌతమిని వేధించసాగాడు. దీంతో గౌతమి తండ్రి అశోక్ రూ.లక్ష ఇవ్వగా గణేశ్ ఆ డబ్బుతో ఆటో కొనుగోలు చేశాడు. ఆటో నడుపగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. ఈ క్రమంలో మరోసారి డబ్బులు సరిపోవడం లేదంటూ గౌతమిని ఇబ్బందులకు గురిచేయడంతో మళ్లీ రూ.లక్ష ఇవ్వగా ఆ డబ్బులతో మేకలు కొనుగోలు చేసి స్వగ్రామంలో తండ్రికి అప్పగించాడు. అప్పటి కూడా భార్యతో సక్రమంగా ఉండడం లేదు. ఈ క్రమంలో తనతో కలిసి పదో తరగతి చదువుకున్న అంజలి అనే యువతితో పరిచయం పెరిగింది. దీంతో ఆమెను పెళ్లి చేసుకోవాలని భావించి తనకు అడ్డుగా ఉన్న భార్య గౌతమిని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి భార్య నిద్రిస్తున్న క్రమంలో ఆమె ముఖంపై బెడ్‌షీట్ బిగించి ఊపిరి ఆడకుండా చేసి చంపాడు. అనంతరం ఏమీ తెలియనట్లు నటిస్తూ గౌతమి పిలిచినా పలకడం లేదని తన ఇంటి పక్కన ఉంటున్న పెద్దమ్మ కొడుకు కుమార్‌కు చెప్పాడు. కుమార్ దంపతులు వచ్చి చూసి గౌతమిని 108లో ఎంజీఎం తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటన తర్వాత నిందితుడు తప్పించుకుని తిరుగుతున్న క్రమంలో సోమవారం వరంగల్ చౌరస్తా వద్ద పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు 24 గంటల్లో కేసు ఛేదించిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్సై శివకృష్ణ, సిబ్బంది ఏఎస్పీ అభినందించారు.

కమీషన్ డబ్బులు వెంటనే చెల్లించాలి

- సెప్టెంబర్ 5న రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపులు బంద్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల కమీషన్ డబ్బులు వెంటనే చెల్లించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం నాయకులతో కలిసి హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి రేషన్ డీలర్ల సమస్యలపై ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ సెప్టెంబర్ 5న బంద్ పాటించనున్నట్లు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీలర్లకు కనీస గౌరవ వేతనం రూ.5 వేలు, కమీషన్ పెంపు, ఏ నెల కమీషన్ ఆ నెలలోనే చెల్లించాలని కోరారు. అలాగే, రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హనుమండ్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, కోశాధికారి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, శ్రీనివాస్, రవీందర్, వెంకటేష్, రాము, మోహన్, నాయకులు నర్సయ్య, భానుచందర్,దామోదర్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పశువుల కాపరి దుర్మరణం

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ పశువుల కాపరి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మల్లంపల్లి మండలం శ్రీనగర్ జీపీ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీనగర్‌కు చెందిన ధారావత్ భిక్షపతి(40) అదే గ్రామానికి చెందిన టీక్యానాయక్ వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. సోమవారం పశువులను మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటికి చేర్చాడు. ఒక గేదె రాకపోవడంతో వెతకడానికి యజమాని టీక్యానాయక్.. భిక్షపతిని తీసుకెళ్లాడు. గేదె కనిపించిన అనంతరం తోలుకొని రావాలని చెప్పి బైక్‌పై వెళ్లాడు. గేదెను తోలుకొని వస్తున్న క్రమంలో మల్లంపల్లి బ్రిడ్జి సమీపంలో హనుమకొండ వైపునకు వెళ్తున్న గూడ్స్ వాహనం ఢీకొనడంతో భిక్షపతి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

- కలెక్టర్ స్నేహ శబరీష్



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణంపై ప్రజల్ని చైతన్యపర్చేలా 'మట్టి గణపతుల్ని పూజిద్దాం' నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ.గణేశ్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని సోమవారం కలెక్టర్ స్నేహశబరీష్ సందర్శించారు. ఆస్పత్రికి వస్తున్న గర్భిణులు బాలింతలకు అందిస్తున్న ఓపీ, ఐపీ, డెలివరీ కేసుల వివరాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఎమర్జెన్సీ కేసులకు ఎలాంటి వైద్య సేవలందిస్తారు? ప్రసవం అనంతరం ఎన్ని రోజులకు డిశ్చార్జ్ చేస్తారని, సెక్షన్ ఆపరేషన్స్ హైరిస్క్ కేసుల చికిత్స గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని ప్రతీ వార్డును క్షుణ్ణంగా పరిశీలిస్తూ బాలింతలు, గర్భిణులతో నేరుగా మాట్లాడారు. కలెక్టర్ వెంట అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్మోహన్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ ఖిల్లా.. వరంగల్ జిల్లా

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు గెలిచి ఇక్కడే విజయోత్సవ సభ

- చెప్పి మరీ వర్ధన్నపేట, పాలకుర్తి ఎమ్మెల్యే సీట్లు గెలిచాం
- జనహిత పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పక్కన మీనాక్షి నటరాజన్, ఎంపీ బలరాంనాయక్, మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు తదితరులు

సాక్షి, వరంగల్: కాంగ్రెస్ ఖిల్లా.. వరంగల్ జిల్లా అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆనాడు అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు జరిగిన పాదయాత్రలో వర్ధన్నపేట శాసనసభ్యుడు అరూరి రమేష్, గొప్ప నాయకుడు అని చెప్పుకునే ఎర్రబెల్లి దయాకర్ రావును ఓడిస్తామని చెప్పి మరీ ఆ సీట్లు కైవసం చేసుకున్నామన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామం నుంచి వర్ధన్నపేట టౌన్ అంబేడ్కర్ సెంటర్ వరకు సోమవారం రాత్రి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లా అంటేనే రాజకీయాలకు అడ్డా అన్నారు. మరో మూడేళ్ల పాలన ప్రజలతో శభాష్ అనిపించుకొని 100 సీట్లతో అధికారంలోకి వచ్చాక ఇదే వర్ధన్నపేటలో విజయోత్సవ సభ చేస్తామని అన్నారు. మాజీ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ...'ఓటు చోరీ బీజేపీ... ల్యాండ్ చోరీ బీఆర్‌ఎస్ పార్టీలను బ్యాలెట్ మీద బొంద పెట్టాలి. ఆ రెండు పార్టీలను రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పాతాళం లోతుకి పాతి పెట్టాలి. యూరియా మీద రెండు పార్టీలు దొంగ రాజకీయం చేస్తున్నాయి' అని మండిపడ్డారు. ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రాజేందర్ రెడ్డి, రాంచందర్ నాయక్, మురళీ నాయక్, గండ్ర సత్యనారాయణరావు, యశస్వినిరెడ్డిలు బీఆర్‌ఎస్, బీజేపీలపై దుమ్మెత్తిపోశారు. యూరియా విషయంలో కావాలనే కాంగ్రెస్ పార్టీని బీఆర్‌ఎస్ బద్నాం చేస్తోందన్నారు. యాత్రలో వేం నరేందర్ రెడ్డి, కొండా మురళీ, జంగా రాఘవరెడ్డి, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి ఈ యాత్రకు హాజరుకాకపోవడంపై కార్యకర్తలు చర్చించుకోవడం కనిపించింది. పార్టీ ఫిరాయించారంటూ ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులిచ్చిన వారిలో ఉన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందుకే దూరంగా ఉండొచ్చనే గుసగుసలు వినిపించాయి.

పాదయాత్రకు తరలొచ్చిన శ్రేణులు..

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ రెండో విడత జనహిత పాదయాత్రకు ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావడంతో వర్ధన్నపేట మండలంలో కోలాహలం కనిపించింది. కాంగ్రెస్ నేతలు రాత్రి ఏడు గంటల ఐదు నిమిషాలకు ఇల్లంద చేరుకోగా ఆటపాటలతో కళాకారులు, బోనాలతో మహిళలు ఘనస్వాగతం పలికారు. వీరిరాకకు ముందే ఇల్లందలో కాంగ్రెస్ పార్టీ జెండాను జిల్లా పార్టీ అధ్యక్షురాలు స్వర్ణ ఆవిష్కరించారు. అనంతరం 7.05 గంటలకు భారీ సంఖ్య లో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో కలిసి నేతలు దాదాపు మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగించారు. సుమారు 8.24 గంటలకు వర్ధన్నపేట టౌన్‌లోని అంబేడ్కర్ సర్కిల్ చేరుకున్నారు.

తప్పని తిప్పలు...

- ఇల్లంద నుంచి వర్ధన్నపేట వరకు జనహిత పాదయాత్ర ఉండడంతో పోలీసులు ట్రాఫిక్‌ని కట్రియాల నుంచి కొత్తపల్లి రోడ్డుకి డైవర్ట్ చేయగా భారీ ట్రాఫిక్ జామైంది. అంబులెన్స్ వాహనం కూడా ఆ ట్రాఫిక్‌లో చిక్కుకుంది.
- పాదయాత్ర జరిగే జాతీయ రహదారిలో గుంతలు పూడ్చకపోవడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నడిచే సమయంలో ఇబ్బంది పడ్డారు. కొందరు అదుపుతప్పి కిందపడ్డారు.



పాదయాత్రకు హాజరైన ప్రజలు

చూద్దాం.. చేద్దాం



గ్రీవెన్స్‌లో వినతి పత్రాలు స్వీకరిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

- సమస్యలపై అధికారుల స్పందన లేదని ప్రజల గోడు
- ఫిర్యాదులపై అలసత్వం తగదు: కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్
- గ్రీవెన్ సెల్‌కు 88 ఫిర్యాదులు

వరంగల్ అర్బన్: 'వ్యయప్రయాసాలకోర్చి ఫిర్యాదులు అందించడానికి గ్రీవెన్స్‌కు వస్తే ఇక్కడి సిబ్బంది చూద్దాం.. చేద్దాం అంటూ కాలయాపన చేస్తున్నారు' అంటూ పలు కాలనీల ప్రజలు గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా పలు కాలనీల ప్రజలు కనీస వసతులు కల్పించాలని, సమస్యల్ని పరిష్కరించాలని, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. గ్రీవెన్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదుల్ని త్వరితగతిన పరిష్కరించాలని, అలసత్వం వహించొద్దని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారించాలని, నిధులు, కోర్టు కేసులు విషయాలపై తనతో చర్చించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు మొత్తం 88 ఫిర్యాదులు రాగా.. అందులో ఇంజనీరింగ్ విభాగానికి 34, టౌన్ ప్లానింగ్‌కు 45, హెల్త్, శానిటేషన్‌కు 6, పన్నుల సెక్షన్‌కు 1, నీటి సరఫరాకు 2 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ, సిటీ ప్లానర్లు మహేందర్, రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, హెచ్‌ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళను అవమానించిన నేరస్తుడికి జైలు



వరంగల్ లీగల్ : అప్పుగా ఇచ్చిన డబ్బులు చెల్లించమని అడిగినందుకు మహిళపై అకారణంగా దాడి చేసి అవమానించిన ఘటనలో నేరం రుజువుకావడంతో కాజీపేట మండలం మడికొండకు చెందిన నేరస్తుడు ఎం.డి. యాకూబ్ పాషాకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి శ్రావణ స్వాతి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బోడగుట్టలో నివసిస్తున్న చుంచు పున్నయ్య, భారతమ్మ దంపతులతో యాకూబ్‌పాషా కుటుంబానికి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన వ్యాపార అవసరాల నిమిత్తం యాకూబ్ పాషా 2013, జూన్ 02న పున్నయ్య నుంచి రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించమని అడిగిన ప్రతీసారి ఏదో ఒక కారణంతో వాయిదా వేస్తున్నాడు. దీంతో 2014, అక్టోబర్ 09న భారతమ్మ.. యాకూబ్ పాషా ఇంటికెళ్లి అప్పు వడ్డీతో సహా చెల్లించాలని అడిగింది. దీంతో కోపోద్రిక్తుడైన యాకూబ్ పాషా భారతమ్మను దుర్భాషలాడుతూ మరోసారి తన ఇంటికి వస్తే చంపేస్తానని బెదిరించాడు. అంతటితో ఆగకుండా మహిళ అనే విచక్షణ లేకుండా జుట్టు పట్టి లాక్కెళ్లి నెట్టివేశాడు. ఈ ఘటనపై భారతమ్మ మడికొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువుకావడంతో నేరస్తుడు యాకూబ్‌పాషాకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి శ్రావణ స్వాతి తీర్పు వెలువరించారు.